క్లుప్తంగా

'గ్రోబై'తో పఠనాస్థాయి తెలుసుకోవచ్చు



కథల పుస్తకాలు చదివిస్తున్న రాజు

కెరమెరి: గ్రోబై మోడల్‌తో విద్యార్థుల పఠనాస్థాయిని తెలుసుకోవచ్చని రూంటురీడ్ బ్లాక్ కోఆర్డినేటర్ రాజు అన్నారు. సోమవారం మండలంలోని చౌపన్‌గూడ, సుర్దాపూర్, సావర్‌ఖేడా ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పఠన సామర్థ్యాలు తెలుసుకునేందుకు కథల పుస్తకాలు చదివించాలన్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వర్క్‌బుక్‌లను రాయించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వనిత, నరేశ్, రమేశ్, నందిని, తుల్సిదాస్ తదితరులు ఉన్నారు.

పూలాజీ బాబా చూపిన మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న ముఖ్య సంస్థాన్ నాయకులు

వాంకిడి: పరమహంస సద్గురు పూలాజీ బాబా చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు నడవాలని ఎంపీటీసీ హిర్వె ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని ఖమాన గ్రామంలో పూలాజీ బాబా ధ్యాన కేంద్రం వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పాట్నాపూర్ ముఖ్య సంస్థాన్ నాయకులు బాబా ప్రవచనాలను వినిపించారు. చెడు వ్యసనాల నుంచి దూరం కావాలంటే బాబా చూపిన ధ్యాన మార్గం వల్ల సాధ్యపడుతుందని వివరించారు. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికతతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెందుర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని హేటిగూడలో సోమవారం నాటుసారా స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, లోడెల్లి శ్రీనివాస్ అనే వ్యక్తికి చెందిన కిరాణ దుకాణంలో 4 లీటర్ల నాటుసారా లభించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు నాటుసారా స్వాధీనం చేసుకొని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'

బెజ్జూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం ఎంపీవోపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్ మండల గౌరవ అధ్యక్షుడు రాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సంఘం సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీవోపై ఎంపీపీ దాడికి దిగడం హేయమైన చర్య అన్నారు. ఎంపీవో రమేశ్ రెడ్డి, టీపీఎస్ఎఫ్ మండల కమిటీ సభ్యులు తుకారాం, మారుతి, వెంకటేశ్, విజయ్, వైకుంఠం, భాగ్యలక్ష్మి, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి విఘాతం

కాగజ్‌నగర్‌రూరల్: ప్లాస్టిక్ వస్తువుల వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని మిల్లు సీఎస్ఆర్ ముఖ్య అధికారిణి రీనా బిల్వాల్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎస్పీఎం, సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ రీసైక్లింగ్ దినోత్సవం నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న సాయికుమార్ కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నామానగర్ గ్రామానికి చెందిన మేడి సాయికుమార్ మృతికి కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సోమవారం డీఎస్పీ కార్యాలయం ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈనెల 11న సాయికుమార్ అనుమానాస్పదంగా మృతి చెందాడని, ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయలేదన్నారు. వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ సీఐ శంకరయ్య వారితో చర్చలు జరిపి ధర్నా విరమింపజేశారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

- ప్రైవేట్ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు
- పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేసిన సిబ్బంది
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



కెరమెరి: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులను ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ పుష్పలత, సీఐ సాధిక్ పాషా, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో మహేందర్‌రెడ్డి పరిశీలించారు. జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 146 మంది విద్యార్థులకు 146 మంది హాజరయ్యారని ఎంఈవో సోమయ్య తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 220 మంది విద్యార్థులకు 220 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

చింతలమానెపల్లి: 10వ తరగతి విద్యార్థులకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కస్తూరిబా విద్యాలయంలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 87 మంది విద్యార్థులకు 87 విద్యార్థులు హాజరయ్యారు. కస్తూరిబా విద్యాలయంలో 124 మంది విద్యార్థులకు 123 మంది హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పి.జయరాజ్, కేజీబీవీలో హన్మంతులు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లుగా విధులు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి బందోబస్తు ఏర్పాటు చేయగా ఎంపీడీవో ప్రసాద్, సీఐ సాదిక్ పాషా, ఎస్సైలు నరేశ్ పరిశీలించి బందోబస్తు పర్యవేక్షించారు.

దహెగాం: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 269 మంది విద్యార్థులు ఉండగా వారికి మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 149 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు సీఎస్ కిషన్‌రావు తెలిపారు. కేజీబీవీ పరీక్ష కేంద్రంలో 120 మంది విద్యార్థులకు, 119 మంది పరీక్ష రాయగా ఒకరు గైర్హాజరైనట్లు సీఎస్ అమరేందర్ రెడ్డి తెలిపారు. పరీక్ష సమయంలో ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు బైక్‌లు, ప్రైవేటు ఆటోలలో పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.

కెరమెరి: మండలంలోని కెరమెరి, మోడి పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని కెరమెరి, గోయగాం, అనార్‌పల్లి, మోడి, కేజీబీవీ, హట్టి, రాంజీగూడ, ఝరి పాఠశాలలకు చెందిన మొత్తం 296 విద్యార్థులకు 294 మంది హాజరైనట్లు సీఎస్‌లు చంద్రశేఖర్, స్వర్ణలత తెలిపారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రంలో 148 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్ తెలిపారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రం వద్ద నగునూరి శ్రీనివాస్ జ్యూస్, సామాజిక కార్యకర్త ఎనగందుల తిరుపతి మంచి నీటి సౌకర్యం కల్పించారు.

రెబ్బెన: మండలంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 394 మంది విద్యార్థులు ఉండగా రెబ్బెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు పరీక్షకు 394 మంది విద్యార్థులకు 390 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో వెంకటేశ్వరస్వామి తెలిపారు.



దహెగాం: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



చింతలమానెపల్లి: బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై నరేశ్



కౌటాల: పరీక్ష కేంద్రానికి పరుగులు తీస్తున్న విద్యార్థి



కౌటాల: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



కౌటాల: పరీక్ష కేంద్రానికి విద్యార్థులను బైక్‌పై తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు



పెంచికల్‌పేట్: విద్యార్థులకు జ్యూస్ పంపిణీ చేస్తున్న నాయకులు



కెరమెరి: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, ఖర్చులు, ఇతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ప్రక్రియలో నిబంధనలు పాటించాలన్నారు. అభ్యర్థి ఖర్చుల నిర్వహణకు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచి, వివరాలు నామినేషన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రతీ చెల్లింపు లావాదేవీలను ఖాతా ద్వారా మాత్రమే నిర్వహించాలని, ఖర్చులు గరిష్ఠ పరిమితి మించకుండా చూడాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సభలు, సమావేశాలు, ఇతరత్రా ప్రచార సాధనాలకు నిర్దేశించిన ధరల ప్రకారం లెక్కించనున్నట్లు తెలిపారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలపై ముద్రించే వారు ఏజెన్సీ వివరాలు ముద్రించాలని, లేకుంటే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్‌రోజు ఓటర్లు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులకు సహకరించాలని పేర్కొన్నారు.

వంతెనలు నిర్మించరూ..!

- లోలెవల్ వంతెనలతో తిప్పలు
- వానాకాలంలో దాటలేని పరిస్థితి
- వేసవిలోనే పనులు పూర్తి చేయాలని వేడుకోలు



శివపెల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు (ఫైల్)

చింతలమానెపల్లి: మండలంలోని లోలెవల్ వంతెనలతో ప్రజలు వానాకాలంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధృతికి ఈ వంతెనలు మునిగిపోతుండడంతో వాగులు దాటలేని పరిస్థితి ఉంది. దీంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. పలు గ్రామాలకు చెందిన లోలెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనలు మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. వర్షాకాలం వచ్చేలోపు వాగులపై హైలెవల్ వంతెనలు నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు.

లోలెవల్ వంతెనలే దిక్కు..

మండలంలోని శివపెల్లి, నాయకపుగూడ, దిందా, బూరెపల్లి, రణవెల్లి గ్రామాలకు వెళ్లే మార్గాలలో వాగులు ప్రవహిస్తుంటాయి. ఈ గ్రామాలకు వెళ్లాలంటే వాగులు దాటాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ వాగులు ప్రాణహిత నదికి సమీపంలో ఉండడంతో వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తాయి. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. గూడెం గ్రామం నుంచి శివపెల్లి మార్గంలో రెండు వాగులు ఉండగా వంతెనలు నిర్మించాల్సి ఉంది. బూరెపల్లి, రణవెల్లి గ్రామాల మార్గంలో వాగుపై లోలెవల్ వంతెన ఉండగా వర్షాకాలం వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుంది. దిందా గ్రామానికి వెళ్లే మార్గంలోని లోలెవల్ వంతెనదీ ఇదే పరిస్థితి. మండలంలోని బాబాసాగర్ –నాయకపుగూడ గ్రామాల మధ్య గల వాగుపై వంతెన పనులను ఆరేళ్ల క్రితం అధికారులు ప్రారంభించారు. కానీ ఇప్పటికీ వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. మండలంలోని బూరెపల్లి వంతెన కోసం పలుమార్లు గ్రామస్తులు అధికారులకు సమస్యను విన్నవించారు. దిందా లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అటవీ అనుమతులు మంజూరు కాలేదు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు హామీ ఇస్తున్నా వంతెన నిర్మాణం మాత్రం జరగడంలేదు. గత ఎన్నికల సమయంలో వంతెన పనులు ప్రారంభిస్తున్నట్లు హడావిడి చేసినా పనులు మాత్రం జరగలేదు. వానాకాలం ప్రారంభం కావడానికి మరో నాలుగు నెలల సమయం ఉండడంతో ఆలోపు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి వంతెనలు నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



మొర్రిగూడ పంచాయతీ పరిధిలోని ఘాట్ సెక్షన్ వద్ద ప్రమాదకరంగా మూలమలుపు

- కానరాని సూచిక బోర్డులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

తిర్యాణి: మండల కేంద్రం నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు మంచిర్యాల జిల్లాలోని ఐబీ, తాండూర్, బెల్లంపల్లి, మంచిర్యాల పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మండల కేంద్రం నుంచి మంచిర్యాల వైపునకు వెళ్లే దారిలో ఉన్న ఘాట్ సెక్షన్‌లో ప్రమాదకరమైన మూలమలుపులు ఉండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నిత్యం ఘాట్ సెక్షన్‌లోని మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఒక ఆర్టీసీ బస్సు సైతం అదుపు తప్పి రోడ్డు దిగింది. ఆ సమయంలో సదరు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. అయినప్పటికీ అధికారులు తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్పీడ్ బ్రేకర్లు కరువు..

మొర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఘాట్ సెక్షన్‌లోని ప్రమాదకరమైన మూలమలుపుల వద్ద అధికారులు ఎటువంటి సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఈ ప్రాంతానికి వచ్చే వారు వాహనాలు నడపడం మరింత కష్టంగా మారింది. రాత్రి వేళల్లో ఎక్కడ మూలమలుపు ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొంటుంది. ప్రమాదాలు జరగక ముందే సంబంధిత శాఖ అధికారులు మూలమలుపుల వద్ద హెచ్చరిక సూచిక బోర్డులతో పాటుగా స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని మండలవాసులు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



మండల కేంద్రం నుంచి ఐబీ వైపునకు వెళ్లే దారిలో ఉన్న మూలమలుపుల వద్ద వెంటనే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సూచిక బోర్డులు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణించేటప్పుడు ఎక్కడ మూలమలుపు ఉందో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– దుర్మెట్టి సతీశ్, నాయకపుగూడ

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ఐబీ(తాండూర్) మీదుగా కొత్తగా మండల కేంద్రానికి వచ్చే వాహనదారులు మూలమలుపుల మీదుగా ప్రయాణించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపుల వద్ద వాహనాల వేగం నియంత్రించేందుకు అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– గేడం సుభాశ్, తిర్యాణి

'గాలికుంటు' నివారణ టీకాలు పంపిణీ

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో సోమవారం పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 450 పశువులకు టీకాలు వేసినట్లు వైద్యుడు శివ ప్రసాద్ తెలిపారు. లిఫ్‌స్టాక్ అసిస్టెంట్ సునీల్, వెటర్నరి అసిస్టెంట్‌లు గణపతి, రాజు, అటెండర్లు వినోద్, బాలాజీ, లాలాజీ, నవీన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో సోమవారం పశువైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించారు. ఈ సందర్భంగా గ్రామంలో 158 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సాగర్ తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ముందస్తు టీకాలు వేయించాలని కోరారు. సిబ్బంది విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: పశుపోషకులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని తలోడి గ్రామంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా ఆయన పశువులకు టీకాలు వేశారు. మాజీ ఉపసర్పంచ్ సురేశ్, సిబ్బంది ప్రకాశ్, రాజన్న పాల్గొన్నారు.

రైళ్లు నిలపాలని వినతి

రెబ్బెన: ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లు నిలపాలని అఖిల పక్షం నాయకులు సోమవారం సాయంత్రం స్టేషన్ మాస్టర్ శివరావుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏకైక రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లకు మినహా ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మూడో లైన్ పనుల పేరుతో నెల రోజులుగా స్టేషన్‌లో ఆగాల్సిన అన్ని రైళ్ల హాల్టింగ్‌ను తొలగించారని పేర్కొన్నారు. హైదరాబాద్, విజయవాడ, కాజీపేట, ఖమ్మం, చంద్రపూర్ వెళ్లాలంటే మండల ప్రజలు బెల్లంపల్లి, కాగజ్‌నగర్ వంటి ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్‌లకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.జెడ్పీటీసీ సంతోష్, రమేష్, దేవాజీ, సుదర్శన్‌గౌడ్, చిరంజీవి గౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, జాకీర్ ఉస్మానీ, దేవేందర్, సోమశేఖర్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'ప్రజల అండతో సమ్మె కొనసాగిస్తాం'

కాగజ్‌నగర్‌రూరల్: పేపర్ మిల్లు యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకునేందుకు ప్రజల అండతో సమ్మె కొనసాగిస్తామని కాగజ్‌నగర్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెన్న కిశోర్‌బాబు స్పష్టం చేశారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మిల్లు యాజమాన్యం ఒంటెద్దు పోకడలకు పాల్పడుతుందని, కనీసం కిరాయి చెల్లించకుండా బయట ప్రాంత లారీలకు లోడ్లు అందించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లు అంగీకరించాలని కోరుతున్నా మిల్లు యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో కార్యదర్శి నిజాం, సభ్యులు అహ్మద్ పాషా, షకీల్ అహ్మద్, రాంబాబు, శంకర్, ప్రీతం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు జెర్సీ అందజేత

వాంకిడి: మండలంలోని ఖిరిడి గ్రామ క్రికెట్ జట్టుకు మాలీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సెండె వాసు ఆధ్వర్యంలో సోమవారం జెర్సీలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో ప్రతిభ కనబర్చి గ్రామానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ సీజ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్‌లోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆసిఫాబాద్ నుంచి ఇసుకతో జైనూర్ వస్తుండగా సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను తనిఖీ చేశామన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని మాలీ సంక్షేమ సంఘం కన్నెపల్లి యూత్ అధ్యక్షుడు మోర్లే పాండురంగ్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కన్నెపల్లి గ్రామంలో పది విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. నాయకులు నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

పెంచికల్‌పేట్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమాలను పాటించాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఎన్నికల నిబంధనలపై సోమవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా ఎలాంటి పోస్టులు పెట్టవద్దని సూచించారు. అనంతరం గ్రామంలో బెల్టు షాపులపై దాడులు చేశారు. ఆయన వెంట ఎస్సై కొమురయ్య ఉన్నారు.

కోత్మీర్ గ్రామస్తులకు అవగాహన

దహెగాం: ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడానికి గ్రామస్తులు సహకరించాలని ఎస్సై రాజు అన్నారు. సోమవారం మండలంలోని కోత్మీర్ గ్రామంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విధివిధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రేపు వేలం

కౌటాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పశువుల సంత, వారాంతపు సంతల వేలం నిర్వహించనున్నట్లు కౌటాల గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి ఎం. సురేందర్, కార్యదర్శి ఎస్. సాయికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు వారాంతపు సంతకు రూ. 75 వేలు, పశువుల సంతకు రూ.1.75 లక్షలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రేపు ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని సూచించారు.